# ఊరకరానివారు

## అద్దంకి మాధవశాస్త్రి

శేషు ఆఫీసునుంచి వచ్చి కుర్చీలో కూర్చుని ఓ మోస్తరు హెచ్చుస్థాయిలో ఒకపాట పాడాడు. ఎవరూ రాకపోవడంతో మరి కొంచెం గట్టిగా పాడాడు, అప్పటికీ ఎవ్వరూ రాకపోవడంతో 'రూపా!' అని గట్టిగా పిలిచాడు.

తలుపుమీదతువ్వాలు గాలికి ఇటూ అటూ కదిలింది. గడియారం టిక్ టిక్ మంటోంది. అంతే తప్ప మనుష్యులెవరూ ఆగదిలోకి రాలేదు

శేషు ఒక్క ఉదుటునలేచి ఇల్లంతా కలయజూసి వచ్చాడు. అప్పుడతనికో క్రొత్త బ్రహ్మాండమైన ఆలోచనరాగా కొంత కంగారుపడి డ్రాయరుమీదవెతికాడు. కాని అతనికి కావలసినది అక్కడ కనిపించలేదు దానితో అతను నిరుత్సాహంగా కుర్చీలో కూర్చుండిపోయి,

'హారూపా! నాపై కోపము వచ్చినచో పుట్టింటికి పోనేల? పోతివిపో! ఉత్తరమైన వ్రాయకపోనేల? వ్రాయకపోతివిపో, తలుపు తాళమైన వేయకుండపోనేల? అథమము కాఫీకలిపి ఫ్లాస్కులో పోయకుండా పోనేల?' అని పురాణాలలోలాగా దుఃఖించాడు

ఇటువంటి విచారగ్రస్తమైన స్థితిలో శేషు 'పంఛిబనూం, ఉడ్ సెఫిరూం' మోస్తరులో గాలిలో తేలుతూవచ్చిన రూప రాకను గమనించలేదు

'అయ్యో, ఎంతసేపయిందండీ వచ్చి? ఎదురింటావిడ వాళ్ళ అల్లుడికి పెడుతున్న సూటుగుడ్డ చూస్తూంటే ఆలస్యమయిపోయింది. నా తెలివితక్కువ, వీధి తలుపైనా చూసేనుకాదు!' అంది రూప నొచ్చుకున్నట్టు శేషు అనుకోవాలని.

'నీ తెలివితక్కువ పుట్టింటికి పోయితివిపో, నాకు కాఫీ కలిపి పోనక్కరలేదా?' అన్నాడు శేషు ఇందాకటి ధోరణిలోనే.

'అయ్యోరాతా, పుట్టిల్లేమిటండీ?' అంది రూప అతన్ని భుజంపట్టుకు ఊపుతూ.

అప్పుడు శేషు ఉలిక్కిపడి ఈలోకంలో పడ్డాడు. తరువాత, 'ఓ, నువ్వా, ఎప్పుడొచ్చావ్? పుట్టింటికి ఉడాయించేశావనుకున్నాను' అన్నాడు.

'ఇదేమయినా సినిమా అనుకున్నారేమిటి?' అంది రూప బూట్లు విప్పుతూ

' "ఝణఝణముల్" ' అన్నాడు యోగివేమన' అన్నాడు శేషు లేచి బట్టలు మార్చుకుంటూ.

రూప నవ్వేసి 'పోద్దున్న పోతన్న అన్నారు కదండీ' అని లోపలకు వెళ్ళిపోయింది.

ఆమె ఒకచేతిలో టిఫినూ రెండవచేతిలో కాఫీ పట్టుకువచ్చేసరికి శేషు కుర్చీలో కూర్చుని ఉన్నాడు అతను కాఫీకేసి ఆప్యాయంగానూ, పకోడీలకేసి మామూలుగానూ వాటిమధ్య చుక్కల్లో చంద్రుడులా ప్రకాశిస్తున్న లడ్డూకేసి భయంగానూ చూశాడు

'ఊరకరారు మహాత్ములు' అన్నాడు.

'ఇప్పుడెవరొచ్చారండీ?' అంది రూప.

'అదే. ఆ లడ్డూ, ఆ స్వీటు. పోయినసారి వచ్చినపుడు దాని సృష్టికర్తతో చీర సంపాదించుకోవలసివచ్చింది. మరి ఈసారి ఏమిజరగనున్నదో?

'ఏమండీ, ఇవాళ ఒకటో తారీకు కదూ?' అంది రూప అతని ఎదురుగా బల్లమీద కూర్చుని ముద్దు ముద్దుగా.

శేషు అంతకుమునుపు అనేకమైన ఒకటో తారీకులను చూసి ఉన్నవాడవడంచేత ఈ ప్రశ్నకి అర్థం తృణంగా తెలుసును. అయినా భయపడలేదు. ఏనాడో గుండె దిటవు చేసుకున్నాడు.

'వీరకంకణమూ, సువర్ణసుందరా?' అన్నాడు.

'ఉహూఁ'

'శ్రీపా, షిఫానా?'

'అబ్బ, కాదండీ'

'మామిడిపళ్ళ చంద్రహారమా, చింతచిగురు నెక్లెసా?'

'ఛీ పోండి, మీకంతా వేళాకోళమే' అంది రూప బుంగమూతిపెట్టి సున్నితంగా అతని మోకాలుమీద కొడుతూ.

దూరదృష్టిగల శేషు వెంటనే

'ఆకిటికీతలుపులు వేసెయ్, ఎండవస్తోంది' అన్నాడు.

'అబ్బ, గాలేస్తుంది అవి అలాగ ఉంచి నేను చెప్పేదేదో వింటురూ' అందామె.

వెంటనే శేషు కిటికీవైపుతిరిగిపోయి కిటికీగుండా రోడ్డునూ, అదిదాటాక ఉన్న ఇంటినీ ఆఇంటి వరండాలోవున్న ఒక అమ్మాయినీ చూశాడు.

'ఆహాహా, అంత అందముగానున్న అబల ఎవరు?' అన్నాడు. లేచి కిటికీదగ్గరకువెళ్తూ.

రూప హడావుడిగా లేచి అతన్ని కాలరు పట్టుకు తీసుకువచ్చి కుర్చీలో కూలేసి కిటికీ గడియ వేసింది.

'అబ్బబ్బ, గాలిలేదు' అన్నాడు శేషు.

'ఇదిగో విసినికర్ర' అని రూప ఓక విసినికర్రని అతనిమీద విసిరేసింది.

'దీనితో బాధపడేకన్న ఆ తలుపు తెరుచు ...'

'నేనే విసురుతాను ఇలాగఇవ్వండి కాని మీరు మాట్లాడక నేను చెప్పేది వింటారా వినరా?' అంది రూప కోపంగా మొహం పెట్టి.

'ముఖం కాంక్రీటులాగఉన్నా మనస్సు స్పాంజే చెప్పు చెప్పు'

కాని రూప చెప్పబోయే విషయానికి ముఖం కాంక్రీటులా ఉంటే లాభంలేదు. అందుచేత దాన్ని స్పాంజీలా మార్చేసి,

'అదికాదండి' అంది.

'అంతకుమునుపు నీచే చెప్పబడిన ఏ విషయమును కాదనుచున్నావు?' అన్నాడు శేషు. కాని రూప వినిపించుకోలేదు.

'మీరు ఎప్పుడు ఏమికొన్నా చీరలనీ, జాకెట్లనీ అన్నీ నాకేగాని మీరు...'

'కొంపతీసి నన్నా కొనుక్కుమన్నావేమిటి? ఆ చీర కట్టుకువెళ్తే ఆఫీసులో ఎవరైనా చూసి ప్రేమించిగలరు!'

'మిమ్మల్ని మాట్లాడద్దన్నానా?' అంది రూప విసురుతున్న విసినికర్రతో చిన్న దెబ్బ వేస్తూ.

'ఆహాహా, ఏమి సృష్టిమహిమ! మనకిగాలినిచ్చి ఆనందపరిచే విసనకర్రే వొంటికితగిలితే ఎంత బాధపెడుతుంది!' అని విస్తుపోయాడు శేషు.

'అంచేత ఈనెలలో మీకో సూటు కొనుక్కోండీ, రామాభాయమ్మగారి అల్లుడికి పెడుతున్నారే, వులెన్‌సూటు, అలాంటిది.'

'హతోస్మి! రేపు సీతాబాయమ్మగారి అల్లుడు గుండు...'

'అబ్బ, ఊరుకోండి' అంది రూప ఏడుపు మొహం పెట్టి విసినికర్ర కిందపారేస్తూ,

# ★ ఊరకరానివారు ★

ఇంకేమైనా అంటే ఏడ్చేస్తుందని శేషుకు తెలుసు. అందుచేత అనునయంగా ఇలా అన్నాడు.

'రూపా, నీకు తెలియదు. వులెన్ సూటు అంటే ఆర్ట్ సిల్కు కట్‌పీసు కాదు. దానికి బోలెడు డబ్బవుతుంది. అదీగాక, మా అసిస్టెంటు ఇంజనీరుగారికే లేదు వులెన్ సూటు. అటువంటప్పుడు నేను కొని అవిగంగా ఆఫీసుకువెళ్తే ఆయన నామీద 'బేడ్ రికార్డు' రాసి మారుమూలకి ట్రాన్సుఫరు చేయించి వేస్తాడు. కావున ఆసంగతి వదిలెయ్. నీకు మరీ అంత ముచ్చటగా ఉంటే ఒకరోజున అద్దెకు తీసుకొచ్చి ఆ వేషంలో నీఎదుట ఒకసారి అటూ ఇటూ తిరుగుతాను' అన్నాడు.

'డబ్బు విషయం బెంగ పెట్టుకోకండి. మనిద్దరం రెండొందల రూపాయ లెంచేసుకుంటాం కనక? అయినా అంతకు మునుపుది బేంక్‌లో కొంత డబ్బు ఉంది. మీ ఇంజనీరు ట్రాన్స్‌ఫర్ చేసేస్తానంటే వులెను సూటున్న అసిస్టెంటు ఇంజనీరుదగ్గర వేయించుకోండి. హాయిగా పోదాం' అంది రూప.

'నూటయాభై రూపాయలవుతుంది తెలుసా?'

'ఓస్, ఇంతేనా. అయితే రెండు కొనుక్కోండి, ఒకటి గోధుమరంగూ ఇంకోటి ముక్కుపొడుం రంగూను' అంది రూప ముచ్చటపడుతూ.

ఇంక లాభంలేదనుకున్నాడు శేషు. 'చూడు రూపా, నాకసలు చిన్నప్పటినుంచీ వులెను అంటేనే అసహ్యం. అసలు గొర్రెలున్న చోటికే వెళ్ళేవాడిని కాదు. ఆరునెలల పిల్లాడప్పుడుకూడా ఒకసారి మా నాన్నగారు వులెనుసూటు వేసుకునివస్తే చూసి భయపడిపోయి అరగంటసేపు ఏడ్చానని మొన్న మొన్నటివరకూ మా బామ్మ అంటూండేది. నా కిష్టంలేని ఆ వులెను సూటుకోసం అంత మారాం చేసేబదులు ఫంగానా చీర కావాలని మాటమాత్రంగా అంటే తెచ్చిపడెయ్యనూ?.........చెప్పు—జార్జెట్టా, క్రేపా, షిఫానా, సిల్కా, నేతా?' అన్నాడు.

'గోధుమరంగు. ముందర ఒక సూటుకు తెచ్చుకోండి.'


'అంతేనా? నాగోడు వినవా?'

'ఊహూఁ. ఇప్పుడు మిమ్మల్ని ఇంట్లో ఉండనియ్యను, సూటుగుడ్డ తెచ్చేవరకూ ఇంట్లోకి రానియ్యను.'

'ఎక్కడో త్రేతాయుగంలో మనిషివిలాగ ఉన్నావు' అన్నాడు శేషు లేస్తూ.

* * *

ఏడింటికి ఇంటికి వచ్చినప్పుడు శేషు ఒక



స్కాండినేవియన్ దేశాలకు పోతూ ప్రధాని నెహ్రూ సిరియా రాజధాని డమాస్కస్‌లో దిగినప్పుడు సిరియా అధ్యక్షుడు శ్రీ కువట్లీ సమక్షంలో డమాస్కస్ నగర పౌరసత్వం ప్రసాదించే పత్రాన్ని స్వీకరించారు.

పేకెట్ పట్టుకు వచ్చాడు. రూప వీధిలో కాసుక్కూర్చుంది.

'గోధుమరంగే. నూట పన్నెండున్నర అయింది రేపు టెయిలరుకివ్వాలి' అన్నాడు రూప ఇచ్చిన మంచినీళ్లు తాగుతూ.

'ఇదేమిటీ!' అంది రూప ఆశ్చర్యపోతూ.

'ఆఁ! లేకపోతే పాతిక రూపాయలకి వస్తుందనుకున్నావా?' అన్నాడు శేషు గ్లాసు పెట్టేస్తూ.

'అబ్బ డబ్బు కాదండీ, ఇందులో జార్జెట్ చీర ఉందేమిటి?' అంది రూప ఒక గులాబి రంగు జార్జెట్ చీర నతనికి చూపిస్తూ.

'అరెరె, ఇదెలా వచ్చింది? మర్చిపోయి సూటు ఇచ్చేసి ఇది తెచ్చినట్టున్నాను ఖర్మ!' అన్నాడు శేషు ఒక్క గంతువేసి లేస్తూ.

'ఎవరికిచ్చేసేరండీ?' అంది రూప కంగారుతో.

'మరేం లేదులే. ఇవాళ మా ఆఫీసులో టైపిస్టుకి బర్త్‌డే. పార్టీకి పిలిచింది—నీతో చెప్పడం మర్చిపోయినట్టున్నాను. వెళ్తూ వెళ్తూ ఉత్తచేతుల్తో వెళ్ళడమేమిటని నా సూటుగుడ్డతోపాటు ఈ చీరకూడా కొన్నాను ప్రజంటు చేయడానికి. పొరపాటున ఆ పేకెట్ ఇచ్చేసినట్టున్నాను' అన్నాడు.

రూపకు చాలా బాధ కలిగింది. తన కింతవరకూ ఒక్కటే మంచి జార్జెట్ చీర లేదు. తన కెప్పుడూ కొననిది ఎవరో టైపిస్టుకి బర్త్‌డే ప్రజంటుగా కొన్నాడు!

'ఆ చీర ఇలాగ ఇయ్యి, అది ఇచ్చేసి సూటు పట్టుకువస్తాను' అన్నాడు శేషు చెయ్యి జాపుతూ.

'నే నివ్వను' అంది రూప.

'మరయితే నా కెలాగ వస్తుంది?'

'అదే వస్తుంది. నేను ఈ చీరని మాత్రం ఇవ్వదలుచుకోలేదు. నా కింతవరకూ ఒక్కటి మంచి జార్జెట్ చీర లేదు. అయినా మీరు నాకెందుకు కొంటారులెండి పిల్లకి వాళ్ళకి......'

'ఏయ్ రూపా, ఏమిటా పిచ్చివాగుడూ? నీకు కొనని నేను చెప్పానా? సాయంకాలం ఎంత బతిమాలుకున్నాను? వులెను సూటే కావాలని పంతం పట్టేవుగా? నీకు కావలిస్తే వచ్చే నెల కొనుక్కుందువుగాని, ముందు ఆ చీర ఇలాగియ్యి?'

'నేను ఇవ్వను, ఇవ్వను, ఇవ్వను. మీ రేం చేసుకున్నా సరే, ఏమనుకున్నా సరే' అంది రూప. ఆ చీరని గట్టిగా అదుముకుని కిందకు చూస్తూ, కింద పెదివి కొరుకుతూ.

ఇప్పుడు మొహం రెయిన్ ఫోర్స్డు కాంక్రీటులా ఉంది అనుకున్నాడు శేషు.

ఇంతలో ఎవరో తలుపుతట్టారు. శేషు ఒక్క గంతులో అవతలకువెళ్ళాడు. కొంతసేపు ఏదో మాట్లాడాక నవ్వుతూ ఒక

పార్సెల్ చేతపట్టుకు వచ్చాడు.

'ఇదిగో క్లాతు పంపించేసింది, ఇంక ఆ చీర ఇలాగియ్యి, పోయి ఇచ్చేసివస్తాను.'

'క్లాతు వచ్చేసిందిగా, ఇంక చీరాలేదు ఏమీలేదు ఊరుకోండి' అంది రూప పార్సిలు విప్పుతూ.

'మంచిదానివి ఇంక మానం, మర్యాదా, ఏమీ అక్కరలేదేమిటి . ఓహోహో హోహో, ఇదేమిటిది?'

పార్సెలులోంచి లేత నీలంరంగు క్రేప్ చీర బయటపడింది.

'ఏమిటండీ ఇదంతా?' అంది రూప విసుపు మొహంతో.

'మన సూటు పంపించబోయి ఇంకెవరో ఇచ్చిన చీర పంపించేసినట్టుంది జై శ్రీరామచంద్రా, ఆ చీర ఇలాగియ్యి వెళ్లి ఇచ్చేసి వస్తాను' అని శేషు హడావిడిగా మంచంమీద ఉన్నవాటిని తీసుకుని పరుగెత్తాడు రూప అతన్ని తలుపువరకూ సాగనంపి వెనక్కి వచ్చింది

మంచంమీద గులాబీరంగు జార్జెట్ చీరా, నీలిరంగు క్రేప్‌చీరా అలాగే ఉన్నాయి కాని చాకలి తెచ్చిన శేషు తాలూకు మడత పాంటులు రెండు అదృశ్యమయ్యాయి.

రూపకి అంతా అయోమయంగా ఉంది. ఓ గ్లాసుడు మంచినీళ్ళుతాగి వచ్చింది

మరోగంటకి సైకిలు మీద ఎవరో కుర్రాడు వచ్చాడు 'అయ్యగారు ఇమ్మన్నారండి' అని ఇందాక శేషు పట్టుకుపోయిన రెండు మడత పాంట్లూ, ఒక పార్సిలూ ఇచ్చి వెళిపోయాడు

అమ్మయ్య, ఆఖరికి ఎలాగయితేనేం క్లాతు ఇంటికి చేరిందనుకొని రూప పార్సిలు విప్పింది.

అందులో గోధుమరంగు వులెను క్లాతుకు బదులు పసుపు పచ్చరంగు షిఫాన్ చీర ఉంది.

రూప ఏడ్చినంతపని చేసింది అదేదో ఇంగ్లీషు సినిమాలో తీసిన బీరువాలో అల్లా శవం కనిపించినట్టు తను విప్పిన పార్సిలులో అల్లా చీరలే కనిపిస్తున్నాయి.

ఒకసారి గట్టిగా నవ్వేసింది. తరువాత ఆ మూడు చీరలకేసీ చూచింది. చాలా బావున్నాయి ఏమయినా సరే, ఆ చీరలు తనవి. ఎవ్వరికీ ఇవ్వదల్చుకోలేదు

మరో కొంతసేపటికి శేషు విజిల్ వేసుకుంటూ వచ్చాడు 'ఏం రూపా, క్లాతు ఎలాగ ఉంది?' అన్నాడు

'ఇదిగో, చూడండి' అని రూప నవ్వుతూ షిఫాన్‌చీరని అతనికి చూపించింది

శేషు బిత్తరపోయాడు బుర్ర గిర్రున తిరిగింది చీర చేతుల్లోనికి తీసుకుని ఎక్కడ చూసేడో జ్ఞాపకం చేసుకోడానికి ప్రయత్నించాడు. అది జ్ఞాపకం వచ్చాక తల పట్టుకుని కుర్చీలో కూలబడిపోయాడు

'పార్సిల్సు తారుమారు! అద్భుతమయిన డిటెక్టివ్ కథ! బ్రహ్మాండమయిన సస్పెన్సు' అన్నాడు

'ఇంతకీ ఆ క్లాతు ఎక్కడండీ? మీరు ఆ పాంట్లు తీసుకు పరుగెత్తారెక్కడికి? అసలు ఈ షిఫాన్ చీర ఎలా వచ్చింది?' అంది రూప

'కథంతా పూర్తిగా చెప్తాను విను!' అన్నాడు శేషు 'నేను మర్చిపోయి నా క్లాతు టైలర్సుకి ఇచ్చేసి చీర తీసుకు వచ్చేకానా తరువాత ఆవిడ అది చూసుకుంది సరే, నా క్లాతు పంపించేద్దామనుకుంది ఇంతలో ఆవిడ స్నేహితురాలెవరో వస్తే ఆవిడతో మాట్లాడుతూ ఆవిడ కొనుక్కుని తీసుకు వెళ్తున్న క్రేప్ చీర చూడడానికి తీసుకుంది తరువాత కొంతసేపు మాట్లాడి ఆవిడ వెళిపోతున్నప్పుడు పొరపాటున మన క్లాతు ఇచ్చేసి, ఆ చీర ఇక్కడికి పంపేసింది ఆ చీరా, జార్జెట్ చీరా ఇచ్చేసి మన క్లాతు తెచ్చుకుందామనుకున్న నేను కంగారులో నా పాంట్లు పట్టుకుపోయాను. నా ఖర్మకాలి ఆ పొరపాటు నాకు మెయిన్ రోడ్డుకి వెళ్ళేవరకూ తెలియలేదు నాకు విసుగెత్తిపోయింది అప్పుడింక వెనక్కి రావాలంటే రెండుమైళ్ళదూరం ఉంది ఏమయితే అయిందని ఎదురుగుండా ఉన్న షాపులోకి వెళ్లి ఓ గులాబిరంగు జార్జెట్ చీరా, ఓ లేత నీలంరంగు క్రేప్ చీరా కొనేసివెళ్ళి ఆవిడకి ఇచ్చేశాను అప్పటికప్పుడే ఆవిడ స్నేహితురాలు మన క్లాతు పంపించేసింది. సరే, అది తీసుకు వచ్చేస్తున్నాను

'దారిలో పతీ, సూర్యం కనిపించారు పతి వాళ్లి ఆవిడకి ఓ షిఫాన్‌చీర తీసికెస్తున్నాడు. సరే కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నాం ఇంతలో ఆఫీసుప్యూను వీరన్న కనిపించాడు అతనిఇల్లు ఇటువైపే. ఎలాగా సైకిలు మీద వెళ్తున్నాడు కదా అని నా పాంట్లూ, క్లాతూ ఇంట్లో ఇచ్చెయ్యమని ఇచ్చాను. పతి తన చీర ఇచ్చి వాళ్లింట్లో ఇచ్చెయ్యమన్నాడు. ఆ వీరన్న మళ్లీ పార్సిల్సు తారుమారుచేసినట్టున్నాడు' శేషు కథ ముగించి కొంతసేపు ఆగి మళ్లా అన్నాడు

'ఛీ, ఆ వులెను క్లాతు మనకి అచ్చిరాలేదు. సూర్యం ఒకటి కొనుక్కోవాలనుకుంటున్నాడు వాడికి ఇచ్చేస్తాను'

రూప మాట్లాడలేదు 'అయితే ఆ చీర ఏం చేస్తారు?' అంది కొంతసేపుపోయాక

'రేపు రిటర్ను చేసేస్తాను ఆ షిఫాను చీర పతికి పంపించేస్తాను'

'ఉహూం, అవి నాకు కావాలి పతిగారికి ఇంకో చీర పంపించండి'

శేషు నవ్వుతూ ఆమెకేసి చూశాడు "క్షణ క్షణముల్" అన్నాడు టిక్కనసోమయాజి అన్నాడు.

భోజనమయ్యాక రూప రెండు లడ్డుండలు తెచ్చి ఇచ్చింది

శేషు ప్లేటులో ఉన్న రెండింటికీ నమస్కారంచేసి 'హే మహాత్ములారా' మీరు ఊరక రారని నాకు తెలుసును పోయినసారి ఒక్కరే వచ్చి ఒక్క చీర మాత్రమే పట్టుకుపోయారు ఈసారి త్రిమూర్తులలాగ ముగ్గురు వచ్చి మూడుచీరలని పట్టుకుపోయారు. వచ్చేసారినుంచి ఒక్కొక్కరు మాత్రమే వస్తూ ఉంటే నాకు చాలా మేలుచేసిన వారవుతారు' అన్నాడు. ★

